సాక్షి
వికారాబాద్
శనివారం । 17 । ఆగస్టు । 2024



గమ్యం చేరని పయనం

దౌల్తాబాద్ మండల కేంద్రం నుంచి కోస్గి-మహబూబ్‌నగర్ వెళ్లే డబుల్ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 8లో▸



ధారూరు మండల కేంద్రంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న భక్తులు

శోభితం.. వరలక్ష్మీ వ్రతం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఇళ్లల్లో అమ్మవార్లను అందంగా ముస్తాబు చేసి నైవేద్యం సమర్పించారు.



అనంతగిరి: వికారాబాద్‌లోని వైభవలక్ష్మి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్



మురుగు కాలువలో దోమల నివారణ మందు పోస్తున్న ఆశ కార్యకర్త

కొడంగల్ రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ కార్మికులు, ఆశ కార్యకర్తలు చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆయా కాలనీ వాసులతో మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఇన్‌చార్జ్ ఏడీఏ స్వరూప

బంట్వారం: సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఇన్‌చార్జ్ ఏడీఏ స్వరూప అన్నారు. శుక్రవారం మండలంలోని సుల్తాన్‌పూర్‌లో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పురుగు మందు వాడకాన్ని దాదాపుగా తగ్గించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని, చిరు ధాన్యాల సాగుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పురుగు మందుల పిచికారీపై వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మశ్చేందర్, రైతులు పాల్గొన్నారు.

ఉమ్రా రాష్ట్ర అధ్యక్షుడిగా యాసిన్



యాసిన్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనంతగిరి: ఉమ్రా (యునైటెడ్ ముస్లిం రైట్స్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడిగా వికారాబాద్‌కు చెందిన ఎండీ యాసిన్ ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాసిన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఇంతియాజ్, సంయుక్త కార్యదర్శిగా షేక్ గౌస్ పాషా, సమన్వయ కర్తగా షేక్ మౌలాలీ, సహ అధ్యక్షుడిగా ఎండీ హబీబ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు చాంద్‌పాషా మాట్లాడుతూ.. విద్యావంతుడు, సామాజిక సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి యాసిన్ అని కొనియాడారు. ఆయన్ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం యాసిన్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక సంస్థకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. తనపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని, హక్కుల పరిరక్షణ సమష్టిగా పోరాడుతామని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం పలు ఉపాధి విభాగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజరేటర్, వాషింగ్ మిషన్, ఏసీ రిపేర్, ఇన్‌స్టాలేషన్ అండ్ గ్యాస్ ఫిల్లింగ్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 10వ తరగతి పాసైన వారు, డిప్లొమా, ఇంటర్, వొకేషనల్ కోర్సు చేసిన వారు అర్హులన్నారు. ఎల్‌ఈడీ టీవీ, ఓఎల్‌ఈడీ మానిటర్, మైక్రో వోవెన్, వాటర్ ప్యూరిఫైర్, బేసిక్ హెచ్‌ఏ రిపేర్ అండ్ ఇన్‌స్టాలేషన్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, వొకేషనల్ కోర్సులు చేసిన వారు అర్హులన్నారు. 3 నెలల పాటు జరిగే శిక్షణలో నెలకు రూ.4వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. స్టడీ మెటీరియల్, భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. వయసు 18 నుంచి 25 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి పాసై ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో www.tfbcrt udy circ e.cff.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రుణ విముక్తి | సగం మందికే

మూడో విడతలో 18,885 మంది రైతులకు లబ్ధి

- రూ.247.71 కోట్ల పంట రుణాలు మాఫీ
- జిల్లాలో మొత్తం 2.5లక్షల మంది రైతులు
- ఆయా బ్యాంకుల్లో రుణాలు పొందిన వారు 1.78 లక్షలు
- మూడు దశల్లో మాఫీ అయిన మొత్తం రూ.865 కోట్లు
- లబ్ధి పొందిన రైతులు 91,956మంది



వికారాబాద్: మూడో విడత పంట రుణాల మాఫీ ప్రక్రియ గురువారంతో ముగిసింది. జిల్లాలో 18,885 మంది రైతులకు రూ.247.71 కోట్ల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఇప్పటికే రెండు దశల్లో మాఫీ ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. మూడు దశల్లోనూ సగం మంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరినట్లు తెలిసింది. పథకం పొందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. మాఫీ కాని వారు ఆందోళనకు గురవుతున్నారు. తమకూ న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు, బ్యాంకర్లు విధిస్తున్న కొర్రీల కారణంగానే లబ్ధి చేకూరడం లేదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

వివిధ కారణాల వల్ల మూడు విడతల్లోనూ చాలా మంది అర్హులకు పంట రుణాలు మాఫీ కాలేదు. మాకు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికే కుప్పలు తెప్పలుగా అర్జీలు వచ్చాయి. ఆయా మండలాల నుంచి రెండు వేలకు పైగా ఫిర్యాదులు అందాయి. అర్హులైన వారికి రేషన్ కార్డులు లేకపోవడం, ఆధార్ కార్డు మ్యాచ్ కాకపోవడం, సాంకేతిక సమస్యల కారణంగా పథకం పొందలేకపోయారు.

సగం మందికే..

మూడు విడతల్లో కలిపి సగం మంది రైతులకే రుణ విముక్తి లభించింది. జిల్లాలో 5.90 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 2.50 లక్షల మంది రైతులు ఉన్నారు. గత ఏడాది 1,78,522 మంది రైతులు ఆయా బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందారు. మొదటి విడతలో 46,633 వేల మంది రైతులకు సంబంధించిన లక్షలోపు పంట రుణాలు రూ. 256.26 కోట్ల మాఫీ అయ్యింది. రెండో దశలో 26,438 మంది రైతులకు లబ్ధి చేకూరగా రూ. 262.64 కోట్లు మాఫీ అయ్యాయి. మూడో విడతలో 18,885 మంది రైతులకు రూ.247.71 కోట్లు మాఫీ చేశారు. మూడు విడతల్లో కలిపి 91,956 మంది రైతులకు రూ.865 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. అయితే పథకం అమలు కాని వారు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. సరైన పత్రాలతో వస్తే ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వచ్చిన అర్జీలను ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు ప్రకటించారు.



భూసార పరీక్షలు నిర్వహించొద్దంటూ రోడ్డుపై బైఠాయించిన రైతులు

భూసార పరీక్షలు షురూ

- అడ్డుకోబోయిన రైతులు
- పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగిన పరీక్షలు

యాచారం: నయానగరి(ఫోర్త్‌సిటీ) నిర్మాణానికి సర్కార్ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మొదటి ప్రాధాన్యతగా భూసార పరీక్షలకు నిర్ణయించింది. ఫార్మాసిటీకి భూములు సేకరించిన కుర్మిద్ద గ్రామంలోని సర్వేనంబర్ 311(ప్రభుత్వభూమి)లో టీజీఐఐసీ ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారుల బృందం నాలుగు చోట్ల పరీక్షలకు నిర్ణయించింది. శుక్రవారం మొదటి రోజు ఇంజినీరింగ్ విభాగం ప్రతినిధుల బృందం సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలతో భూసార పరీక్షలు ప్రారంభించింది. సమాచారం అందుకున్న కుర్మిద్ద గ్రామంతో పాటు తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల నుంచి రైతులు అక్కడికి చేరుకున్నారు. భూసార పరీక్షలను అడ్డుకోబోయారు. పట్టా భూముల్లో పరీక్షలు చేయడం లేదని, రైతులకు పరిహారం ఇచ్చిన అసైన్డ్, ప్రభుత్వ భూముల్లోనే నిర్వహిస్తున్నట్లు టీజీఐఐసీ అధికారి వరుణ్ తెలియజేశారు. అయినప్పటికీ రైతులు వినిపించుకోలేదు. భూసార పరీక్షలు నిర్వహించే పొలం పక్కన రోడ్డుపై బైఠాయించి కొద్ది సేపు ఆందోళన నిర్వహించారు. టీజీఐఐసీ అధికారుల ఫిర్యాదు మేరకు మహేశ్వరం అడిషనల్ డీసీపీసత్యనారాయణ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, మంచాల, కందుకూరు, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ల సీఐలు సత్యనారాయణ, బాబ్యానాయక్, సీతారాం, నర్సింహారావు ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రైతులపై గతంలోని బీఆర్‌ఎస్ సర్కార్ మాదిరిగానే ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని కుర్మిద్ద మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ శ్రీకాంత్ నాయక్ అన్నారు. సర్కార్ తీరు మారకపోతే ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్నవారికి నచ్చజెప్పి పంపించారు. అనంతరం పోలీస్ బందోబస్తు మధ్య భూసార పరీక్షలు కొనసాగాయి.



తాండూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్
- తాండూరు రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ పనుల పరిశీలన

తాండూరు: గడువులోపు తాండూరు రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే శాఖ డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాండూరు రైల్వేస్టేషన్‌ను సికింద్రాబాద్ డివిజన్ అధికారులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైల్వే శాఖ అమృత్ భారత్ పథకం ద్వారా స్టేషన్ ఆధునీకరణ పనులకు రూ.27కోట్లు మంజూరు చేసిందన్నారు. గతేడాది నుంచి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 50 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పార్కింగ్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ప్రయాణికుల విశ్రాంతి గదులు, ఎస్కలెటర్, టికెట్ బుకింగ్ కౌంటర్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు.పనుల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

తాండూరు అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



నాయకులకు పనుల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.8.80 కోట్ల మంజూరు కాపీలను నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. తాండూరు మున్సిపాలిటీ తోపాటు పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునేలా పని చేస్తానన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, వెంకన్న గౌడ్, ప్రవీణ్‌గౌడ్, బోయ రవిరాజ్, భీంసింగ్ రాథోడ్, మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, నాయకులు సర్దార్‌ఖాన్, నాగరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ..ఉచిత బస్సు ప్రయా ణం పథకంతో మహిళల నుంచి కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పోతున్నారని అ న్నారు. సహనం కోల్పోయి మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే మహిళలతో కలిసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సిద్ధాల దశరథ, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మీర్‌పేట మహిళా అధ్యక్షురాలు పద్మ, గంగమ్మ, కీసర యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్ట్

- 64 చోరీ కేసుల్లో నిందితుడు
- 10 సార్లు జైలుకెళ్లినా మారని తీరు
- చందానగర్‌లో తాళం పగులగొట్టి చోరీ
- పోలీసులకు చిక్కిన దార్ల నేహ చియా అలియాస్ బ్రూస్లీ



కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్ తదితరులు

గచ్చిబౌలి: మూడు రాష్ట్రాల పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, సీరియల్ హెచ్‌బీ అఫెండర్ దార్ల నేహ అలియాస్ బ్రూస్లీ ఎట్టకేలకు చిక్కినట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు. 64 కేసుల్లో నిందితుడిగా ఉన్న బ్రూస్లీ 10 సార్లు జైలుకు వెళ్లినా తీరు మారలేదని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. చందానగర్ పీఎస్ పరిధిలో నివాసం ఉంటున్న నాయుడు వెంకటేశ్వర్ రావు ఈ నెల 10న రాత్రి కూతురును శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో వదిలేందుకు భార్య, కొడుకుతో కలిసి వెళ్లాడు. 11న తెల్లవారు జామున 4 గంటలకు తిరిగి రాగా ఇంట్లోని స్కూటీ దొంగిలించినట్లు గుర్తించారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తాళం పగులగొట్టిన విధానం, వేలి ముద్రల ఆధారంగా కర్నాటకకు చెందిన దార్ల నేహ మియా అలియాస్ బ్రూస్లీగా పోలీసులు గుర్తించారు. స్కూటీపై వెళుతుండగా చందానగర్ పోలీసులు పట్టుకున్నారు. దార్ల నేహ మియా, కుర్వ నగేష్‌లు కలిసి చోరీ చేసినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 25 తులాల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి వస్తువులు, రెండు బైక్‌లు, రూ.29 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

64 కేసుల్లో నిందితుడు

తెలంగాణ, ఏపీ, కర్నాటక రాష్ట్రాలలో రెక్కీ నిర్వహించి ఇళ్లల్లో చోరీ చేయడంలో బ్రూస్లీ సిద్ధహస్తుడు. సైబరాబాద్‌లో 17, హైదరాబాద్ 12, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 6, కర్నాటకలో 7, ఏపీలో 9, జీఆర్‌పీ సికింద్రాబాద్‌లో 2 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. తాజాగా మరో 11 చోరీలు చేసినట్లు బ్రూస్లీ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. 13 కేసుల్లో జైలు శిక్ష పడగా, 11 కేసుల్లో అరెస్ట్ చేశారు. దీంతో మొత్తం 64 కేసుల్లో బ్రూస్లీ నిందితుడిగా ఉన్నట్లు తేలింది. మే 5న జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన బ్రూస్లీ మళ్లీ చోరీల బాటపట్టాడు. జల్సా జీవితానికి అలవాటు పడ్డ ఆయన తాజాగా నగేష్ అనే వ్యక్తితో కలిసి చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, మియాపూర్ ఏసీపీ నర్సింహ్మారావు, చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, డీఐ సంజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోదండరామ్‌ను విద్యాశాఖ మంత్రి చేయాలి

టీజేఎస్ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్

తాండూరు టౌన్: ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌కు విద్యాశాఖా మంత్రి పదవి ఇవ్వాలని టీజేఎస్ తాండూరు నియోజకవర్గ ఇంచార్జి సోమశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన కీలకపాత్ర పోషించిన విషయం అందరికీ విదితమేనన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్‌ను తీవ్రంగా అవమానించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయమన్నారు. విద్యావ్యవస్థపై ఆయనకు సంపూర్ణ అవగాహన ఉందని, ప్రభుత్వం ఆయనకు విద్యాశాఖా మంత్రి పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని కోరుతున్నామన్నారు.

ఉత్తమ టైపిస్ట్‌కు ఘన సన్మానం


వెంకటేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ జయరాం

దోమ: మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముద్దం వెంకటేశ్ యాదవ్ ఉత్తమ టైపిస్టుగా ఎంపికయ్యాడు. జిల్లా కార్యాలయంలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా గురువారం ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వెంకటేశ్‌యాదవ్‌కు ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ సోమలింగం, సహచర సిబ్బంది ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ రీత్యా మరింత ఎదిగి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ఆపరేటర్లు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

మహిళా కాంగ్రెస్ నేత జయమ్మ



మంచాల: మహిళలపై అనుచిత వాక్యాలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ జనరంజక పాలన చూసి ఓర్వలేక మాట్లాడడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి బీఆర్ఎస్‌లో వణుకు పుడుతోందన్నారు. మహిలలు ఉద్యమించముందే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు ఓపీ సేవలు బంద్

తాండూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రితో పాటు ప్రైవేటు క్లినిక్‌లలో శనివారం వైద్య సేవలు నిలిచిపోనున్నాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు వైద్యులు సమ్మె చేపట్టనున్నారు. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య ఘటనేను ఖండిస్తూ 24 గంటల సమ్మె నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 6నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు వైద్య సేవలు నిలిపివేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీ సేవలు బంద్ కానున్నాయి. మరోవైపు ఆర్ఎంపీలు, పీఎంపీ, బీఏఎంఎస్ నిర్వహించే క్లినిక్‌ల్లోని వైద్యులు సైతం ఆందోళన కార్యక్రమంలో పాల్గొంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యులకు రక్షణ కల్పించాలని ఐఎంఏ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

గమ్యం చేరని పయనం

నిత్యం వాహనాల రద్దీ
- మలుపుల్లో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


కోస్గి–దౌల్తాబాద్ రోడ్డు


బోల్తాపడ్డ మినీ డీసీఎం(ఫైల్)

దౌల్తాబాద్: మండల కేంద్రం నుంచి కోస్గి–మహబూబ్‌నగర్ వెళ్లే డబుల్ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి రోజు ఎవరో ఒకరు ప్రమాదానికి గురై చావు బతుకులతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ మార్గంలో మలుపులతో పాటుగా వాహనాల రద్దీ సైతం ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే జనం జంకుతున్నారు. ఈ మార్గంలో వెళ్తున్నామంటేనే జర భద్రం అంటూ కుటుంబీకులు జాగ్రత్తలు చెబుతున్నారంటే తీవ్రత ఎంత స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు అడ్డు కట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదేళ్లుగా 20మంది మృత్యువాత

దౌల్తాబాద్ నుంచి చల్లాపూర్ మీదుగా కోస్గి వరకు 20 కిలోమీటర్ల దూరం. కానీ ఈ మార్గంలో మూల మలుపులు ఎక్కువగా ఉన్నాయి. దౌల్తాబాద్ మలుపు నుంచి సురాయిపల్లి స్టేజీ మధ్యలో నిత్యం ఏదో ఓ చోట ప్రమాదం జరుగతూనే ఉంది. గతేడాది జాతర వెళ్తున్న ఓ మినీ డీసీఎం బోల్తా పడడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెంగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు.ఓ ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొట్టడంతో వాహనదారుడి కాలు విరిగింది. ఈ నెల రోజుల్లోనే మూడు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గత ఐదేళ్లుగా ఈ మార్గంలో ప్రయాణించి 20మంది వరకు మృత్యువాత పడినట్లు లెక్కలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నివారణ చర్యలు అవసరం



దౌల్తాబాద్ నుండి కోస్గి మార్గంలో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో వాహనాలు బోల్తాపడుతున్నాయి. కొందరు మృతిచెందగా మరి కొందరు గాయాలపాలయ్యారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– శివారెడ్డి, ఈర్లపల్లి

హజ్ యాత్రలో కుటుంబం.. చోరీకి విఫలయత్నం

- బంగారం, నగదు క్షేమం
- కుటుంబ సభ్యులు లేకపోవడంతో తేలని లెక్క


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

తాండూరు టౌన్: గుర్తు తెలియని దుండగులు ఓ ఇంట్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఈ ఘటన తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. టౌన్ సీఐ సంతోష్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని సాయిపూర్ ప్రాంతానికి చెందిన స్టోన్ వ్యాపారి వికారుద్దీన్ పర్వేజ్ ఈ నెల 4న కుటుంబ సమేతంగా హజ్‌యాత్రకు వెళ్లాడు. ఇదే ఇంట్లో పైపోర్షన్‌లో ఉండే బంధువులు శుక్రవారం తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న క్లూస్ టీం, పట్టణ పోలీసులు ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. కాగా ఇంట్లోని ఓ గదిలో పెట్టిన రూ.16లక్షల నగదు, సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు దొంగల కంట పడలేదు. పెట్టిన చోటే ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. మూడు తులాల నెక్లెస్ కనిపించడం లేదని యజమాని వస్తేనే పూర్తి క్లారిటీ వస్తుందని బంధువులు తెలిపారు. చోరీ ఎప్పుడు జరిగిందో సరైన సమాచారం లేదని.. పర్వేజ్ యాత్రకు వెళ్లిన విషయం తెలిసినవారే చోరీకి యత్నించి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్టాఫ్ నర్సుపై మహిళ దాడి


ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మహిళను కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: విధుల్లో ఉన్న స్టాఫ్ నర్స్‌పై ఓ మహిళ దాడి చేసింది. ఈ ఘటన శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది. ఎస్ఐ బలరాం తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన నీలం అలియాస్ రేనికుంట భార్గవి కుక్క కాటుకు గురైంది. దీంతో ఆమె ప్రభుత్వాస్పత్రిలో మొదటి డోస్ వ్యాక్సిన్ తీసుకుంది. గురువారం రెండో డోసుకు వెళ్లగా.. అక్కడే విధుల్లో ఉన్న దాసరి ఆశ ప్రిస్కిప్షన్ చూపమని కోరింది. దీంతో అక్కడ నుంచి వెళ్లిపోయిన నీలం తిరిగి రాత్రి ఆస్పత్రికి వచ్చి స్టాఫ్ నర్స్‌పై దాడికి దిగింది. ఈ దాడిని నిరసిస్తూ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శుక్రవారం విధులు బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్టాఫ్ నర్స్ ఆశ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నీలంను కోర్టులో హాజరు పరిచారు.

షాద్‌నగర్ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు

- డీఐ, కానిస్టేబుళ్లపై పలు సెక్షన్ల కింద కేసు
- హైకోర్టులో బాధితుల పిటిషన్

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళిత మహిళపై పోలీసుల దాడి కేసులో ఎఫ్ఐఆర్ నమోదైంది. బాధితురాలిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణల నేపథ్యంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ)తో పాటు ఆరుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు సునీత ఈ నెల 11న స్థానిక ఠాణాలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సస్పెన్షన్‌లో ఉన్న డీఐ రాంరెడ్డితో పాటు నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం, ఉద్దేశపూర్వకంగా హింస, మారణాయుధాలతో దాడి తదితర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

దాడి ఘటనలో బాధితులు హైకోర్టును ఆశ్రయించినట్లు న్యాయవాది డాక్టర్ బి.కార్తీక్‌నవయన్ శుక్రవారం తెలిపారు. డీఐ రామిరెడ్డితో పాటు కానిస్టేబుళ్లను సర్వీసు నుంచి తొలగించాలని, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పిటిషన్‌లో కోరారు. అధికారులు కేసును తప్పుదోవ పట్టించకుండా దర్యాప్తును నిష్పక్షపాతంగా జరిగేలా కేసును సీబీఐకి అప్పగించాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

- బుద్ధిమాంద్యం కలిగిన కుమారుడు పుట్టాడని దూరం పెట్టిన భర్త
- బిడ్డతో కలిసి నిరసనకు దిగిన వైనం..


భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న అలేఖ్య

రాజేంద్రనగర్: తనలా మరో మహిళకు అన్యాయానికి గురి కావొద్దంటూ ఓ గృహిణి తన కుమారుడితో కలిసి భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. మానసిక వికలాంగునిగా పుట్టిన సంతానాన్ని వద్దని తనను దూరం చేశాడంటూ నిరసన వ్యక్తం చేసింది. బాధితురాలి వివరాల ప్రకారం..రాజేంద్రనగర్ హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన బి.ఉదయ్ భాస్కర్ వివాహం ఫతేనగర్‌కు చెందిన అలేఖ్యతో 2014లో జరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన భాస్కర్‌కు వివాహ సమయంలో ఘనంగా కట్న కానుకలు ఇచ్చి వివాహం జరిపించారు. 2016లో వీరికి కుమారుడు జన్మించాడు. బాలుడు బుద్ధి మాంద్యంతో పుట్టడంతో ఉదయ్ భాస్కర్ భార్యాబిడ్డలిద్దర్ని దూరం పెట్టాడు. కుమారుడు అవసరం లేదని భర్త ఉదయ్ భాస్కర్‌తో పాటు కుటుంబ సభ్యులు తెలపడంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. పెద్దలతో పంచాయతీ పెట్టినా పరిష్కారం కాలేదు. వీరిద్దరి మధ్య కేసు కోర్టుకు చేరింది. ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తుంది. తనలా మరోకరికి అన్యాయం కావొద్దంటూ తన కుమారుడితో కలిసి హైదర్‌గూడలోని భర్త ఇంటి వద్ద శుక్రవారం ఆందోళనకు దిగింది. అలేఖ్య బంధువులు సైతం మద్దతు ప్రకటిస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలిసి భాస్కర్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు.


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కేఎల్లార్ తదితరులు

ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 20న నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, ఆయల ఉత్సవ కమిటీ సభ్యుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి అమ్మవారి కల్యాణం, బోనాల కార్యక్రమాలకు ఆహ్వానించారు. ఆహ్వానపత్రిక అందించిన వారిలో నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, పార్టీనాయకులు, గ్రామస్తులు తదితరులున్నారు.

ప్రమాదంలో గాయపడిన పెయింటర్

చికిత్స పొందుతూ మృతి

కేశంపేట: బైక్ ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన బట్టు మహేశ్(23), మిత్రుడు జగదీశ్ పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఈ నెల 14న రాత్రి ఇరువురు బైక్‌పై షాద్‌నగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులోకి రాగానే వారి బైక్ అదుపుతప్పి చెట్ల పొదల్లో పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే షాద్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మహేశ్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫ్రూట్ జ్యూస్‌లో పురుగులు

- మున్సిపల్ అధికారులకు వినియోగదారుడి ఫిర్యాదు
- జ్యూస్ సెంటర్‌ను సీజ్ చేసిన అధికారులు


జ్యూస్ సెంటర్‌లోని ఫ్రిడ్జిలో నిల్వ చేసిన పండ్లు, క్యారెట్


మిలాప్ జ్యూస్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

తాండూరు టౌన్: కుటుంబ సభ్యుల కోరడంతో ఓ వ్యక్తి ఫ్రూట్ జ్యూస్ కొనుగోలు చేసి తీసుకెళ్లగా అందులో పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో ఆందోళన చెందిన వినియోగదారుడు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటుగా దుకాణదారుడిని నిలదీశాడు. ఈ ఘటన శుక్రవారం పట్టణంలోని ఇందిరా చౌక్‌లోని మిలాప్ జ్యూస్ సెంటర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యుల కోసం స్ట్రాబెర్రీ ఫ్రూట్ జ్యూస్ కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లి ఓపెన్ చేయడంతో అందులో పురుగులు కనబడ్డాయి. దీంతో ఆందోళన చెందిన సదరు వినియోగదారుడు వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. జ్యూస్ సెంటర్‌కు చేరుకుని మూడు రోజుల క్రితం తయారు చేసి అమ్మితే అనారోగ్యం పాలైతే ఎవరిది బాధ్యత అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు జ్యూస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఫ్రిడ్జిలో నిల్వ చేసిన పండ్లు, బూజు పట్టిన క్యారెట్, నిల్వ ఫ్రూట్ జ్యూస్‌లను స్వాధీనం చేసుకుని జ్యూస్ సెంటర్‌ను సీజ్ చేశారు. బేకరీలు, జ్యూస్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నిల్వ చేసిన పదార్థాలను విక్రయిస్తే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిలాప్ జ్యూస్‌సెంటర్ నుంచి సేకరించిన జ్యూస్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతామన్నారు. అప్పటి వరకు సెంటర్ సీజ్ చేసి ఉంటుందన్నారు.

సెలూన్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దు

మణికొండ: స్థానికంగా ఉంటూ గ్రామస్తుల అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూ సెలూన్‌లను నడుపుకుంటున్న నాయీ బ్రాహ్మణుల పొట్ట కొట్టేలా వివిధ పేర్లతో సెలూన్‌లు వెలుస్తున్నాయని, వాటికి అనుమతులను జారీ చేయవద్దని మణికొండ మున్సిపాలిటీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్.శ్రీనివాస్, నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కొత్తగా సెలూన్‌లు ఏర్పాటుకు 500 అడుగుల దూరం ఉండాలనే నిబంధన ఉందని వాటిని పాటించకుండా ఇష్టారాజ్యంగా పలు బ్రాండెడ్ సంస్థలు సెలూన్‌లు ఏర్పాటు చేసి తమ పొట్ట కొడుతున్నారన్నారు. అలాంటి వాటికి ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయవద్దని మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో బాబురావు, శ్రీకాంత్, భరత్, పురుషోత్తం, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దొంగల బీభత్సం

- పటేల్‌చెరువులో మూడు ఇళ్లలో చోరీ
- 115 తులాల వెండి, అరతులం బంగారు ఆభరణాలు మాయం
- రూ.20వేల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు


పటేల్ చెరువు తండాలో మోహన్‌నాయక్ ఇంటి పరిశీలిస్తున్న క్లూస్ టీం

మంచాల: ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ చేసి దొంగలు బీభత్సం సృష్టించిన ఘటన పటేల్ చెరువు తండాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తండా సర్పంచ్ మోహన్ నాయక్ ఇబ్రహీంపట్నంలో నివాసం ఉంటున్నాడు. హోంగార్డు రవి ఉద్యోగ్య రీత్యా నగరంలో నివాసం ఉంటున్నాడు. జర్పుల బిచ్యానాయక్ కుటుంబ సభ్యులు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయపురం మండలం గంగమూల తండాలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. మాజీ సర్పంచ్ ఇంట్లో అరతులం బంగారం, ఐదు తులాల వెండి, రూ.5వేల నగదు, హోంగార్డు ఇంట్లో రూ.10వేల నగదు, బిచ్యానాయక్ ఇంట్లో 70 తులాల వెండి కాళ్లకడియాలు, 20 తులాల వెండి చేతి కడియాలు, మరో 20 తులాల వెండి వస్తువులు, రూ.5వేల నగదు దోచుకెళ్లారు. ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులతో పాటుగా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మంచాల ఎస్ఐ రజినీకర్, లాలయ్య క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాజీనామానా.. అవిశ్వాసమా..?

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిపై కాంగ్రెస్ కసరత్తు


చెవుల స్వప్న, చైర్‌పర్సన్


పండుగుల జయశ్రీ, 8వ వార్డు కౌన్సిలర్



పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నాటి నుంచి పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి పంచాయితీ ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు మార్పుపై సీరియస్‌గానే ఉన్నట్లు తెలుస్తోంది. రెండేళ్లుగా చైర్‌పర్సన్ పదవి కోసం 8వ వార్డు కౌన్సిలర్ పండుగల జయశ్రీ పలుమార్లు విఫల యత్నం చేసిన విషయం విదితమే. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జయశ్రీని మున్సిపల్ చైర్‌పర్సన్‌ను చేస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం అప్పటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్న చైర్‌పర్సన్ చెవుల స్వప్న అనూహ్యం హస్తం గూటికి చేరారు. దీంతో అప్పటి నుంచి ఈ పంచాయితీ వాయిదా పడుతూ వస్తోంది. ఓ వైపు స్వప్న పదవిని వదులుకునేందుకు ఇష్టపడక.. ఇటు పదవిని ఆశిస్తున్న కౌన్సిలర్ మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశీస్సులతో చైర్‌పర్సన్ అయ్యేందుకు పట్టుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకులు పలు మార్లు కౌన్సిలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. చెర్‌పర్సన్ మార్పు తప్పనిసరి నేపథ్యంలోనే సమావేశాలు ఏర్పాటు చేశారని చర్చలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి విధేయుడిగా ఉంటూ మల్‌రెడ్డి సోదరులకు అనుచరుడిగా గుర్తింపు ఉన్న పండుగుల రాజు భార్య పండుగుల జయశ్రీని చైర్‌పర్సన్ చేసే అవకాశం ఉందని పెద్ద అంబర్‌పేటలో ప్రచారం జరుగుతోంది. కొన్ని నెలలుగా కొనసాగుతోన్న రాజకీయ అనిశ్చితికి ఫుల్‌స్టాప్ పడాలంటే మరో రెండు రోజులు ఆగాల్సిందే..

'రాజీ'నామా కుదిరేనా..?

చైర్‌పర్సన్ స్వప్నతో పాటు ఆ స్థానం కోసం పోటీ పడుతున్న జయశ్రీ ఇద్దరూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే. ఎన్నికల ముందు జయశ్రీకి ఇచ్చిన హామీ మేరకు పార్టీ పెద్దలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. స్వప్నతో రాజీనామా చేయించి వెంటనే ఆమోదిస్తే ఇరువురి ఖర్చులు తగ్గడంతో పాటుగా సమయం కలిసొస్తుందని ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. స్వప్న రాజీనామాకు అంగీకరించని యెడల మెజార్టీ కౌన్సిలర్లచే అవిశ్వాస నోటీసులు జారీ చేయించి అవిశ్వాస పరీక్షకు వెంటనే ఇప్పించాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్వప్న పదవికి రాజీనామాకు ఒప్పించే బాధ్యతను మున్సిపల్ స్థాయిలోని ఓ సీనియర్ నేతకు అప్పగించారని.. ఒకటి, రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తిచేయాల్సిందిగా శుక్రవారం సమావేశంలో ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.